క్లుప్తంగా

పలమనేరుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు

పుంగనూరు: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై తెలుగుదేశం పార్టీ బనాయించిన అక్రమ కేసుల్లో హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ఎంపీ మిథున్‌రెడ్డి పలమనేరు డీఎస్పీని కలసి బెయిల్‌బాండ్లు సమర్పించి, హైకోర్టు ఆదేశాల మేరకు హాజరయ్యారు. ఆయనకు సంఘీభావం ప్రకటిస్తూ సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు అమ్ము, పూలత్యాగరాజు, కిజర్‌ఖాన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర పలమనేరుకు వెళ్లి ఎంపీని కలిశారు. పలు విషయాలపై చర్చించారు.

నియామకం

రొంపిచెర్ల: ఏపీ ఎస్సీ, ఎస్టీ పోరాట కమిటీ రొంపిచెర్ల మండల అధ్యక్షుడిగా టి.సహదేవ్‌ను నియమిస్తూ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బుల్లా రాజారావు నియామక పత్రం పంపారు. ఎస్సీ, ఎస్టీ కులాల అభ్యున్నతిని తన వంతు కృషి చేస్తానని సహదేవ్ చెప్పారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


రాధాక్రిష్ణన్

గుడుపల్లె: ఎంపీడీఓగా రాధాక్రిష్ణన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న తాజ్ మస్రూర్ అన్నమయ్య జిల్లా మదనపల్లెకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రామకుప్పం ఈఓపీఆర్డీ రాధాక్రిష్ణన్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓగా ప్రభుత్వం నియమించింది.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి వ్యక్తి అరెస్ట్

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో నిందితున్ని శుక్రవారం పోలీసుల అరెస్టు చేశారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. చిత్తూరు ఆర్టీసీ టు డిపోలో సతీష్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గురువారం బస్సు తీసుకుని పరదరామికి వెళుతుండగా ఇరువారం కూడలి వద్ద సతీష్ (30) అనే వ్యక్తి బస్సుకు అడ్డంగా వచ్చాడు. ఎందుకని ప్రశ్నించడంతో డ్రైవర్‌పై దాడి చేయగా గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట ప్రవేశపట్టగా రిమాండ్‌కు ఆదేశించడంతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు.

గ్యారేజీలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి


ప్రతిజ్ఞ చేస్తున్న గ్యారేజీలోని కార్మికులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఆర్టీసీ–2డిపో గ్యారేజీలో గురువారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐ అల్తాఫ్ మాట్లాడుతూ, పటేల్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

ప్రాణం తీసిన చైన్ స్నాచింగ్


ప్రమీల (ఫైల్)

చిత్తూరు అర్బన్/పూతలపట్టు: వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ పోలీసులకు సవాళ్లు విసురుతున్న ఒక ముఠా నిండు ప్రాణాన్ని బలిగొంది. మెడలో ఉన్న బంగారు చైనును లాక్కొనే క్రమంలో కిందపడి గాయపడిన ప్రమీల (60) శుక్రవారం మృతి చెందింది. గత నెల 26న ఇద్దరు దుండగులు ముఖాలకు మాస్కు పెట్టుకుని పూతలపట్టు–పీలేరు జాతీయ రహదారిపై బైక్‌పై వస్తున్నారు. పేట మిట్టకు ఎలా వెళ్లాలి అని బైక్‌పై వెళుతున్న ఐరాల మండలం పుల్లూరుకు చెందిన ప్రమీల, ఆమె కుమార్తె మల్లికను అడిగారు. కదులుతున్న వాహనం నుంచే ఇటువైపు వెళ్లండి అని చెబుతున్న ప్రమీల మెడలో ఉన్న బంగారు గొలుసును లాగారు. ఆమె కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. ఆమెను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కోమాలో ఉన్న ఆమెను తమిళనాడులోని రాణిపేటలో ఉన్న మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించిందని అక్కడి వైద్యులు చెప్పడంతో మల్లికను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమె శుక్రవారం మృతిచెందింది. దుండగులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బస్సుల్లేక ఇక్కట్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పండుగ సాకు చూపి ఆర్టీసీ పలు బస్సులను డిపోకే పరిమితం చేసింది. పల్లె బస్సులతోపాటు మరిన్ని బస్సులను నిలుపుదల చేయించింది. పండుగలో కలెక్షన్ ఉండదని భావించి ఆపేసింది. దీంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురి కావాల్సి వచ్చింది. పుత్తూరు, పెనుమూరు, పరదరామి, ఇతరత్రా మార్గాల్లో గురువారం బస్సులకు బ్రేకులు వేసింది. దీంతో చిత్తూరు నుంచి అటువైపు వెళ్లే ప్రయాణికులు గమ్యం చేరుకోవడానికి నానా తిప్పలు పడ్డారు. శుక్రవారం కూడా తిరుపతి, బెంగుళూరు వెళ్లే ప్రయాణికులకు ఇదే పరిస్థితి ఎదురైంది.

పింఛను పాట్లు!


కుప్పం: సచివాలయం వద్ద వృద్ధురాలి అవస్థ

- ఇళ్ల వద్దకే రాని వైనం
- సచివాలయానికి వెళ్లలేక లబ్ధిదారుల అగచాట్లు
- మధ్యాహ్నం వరకు పనిచేయని సర్వర్


కుప్పం: పింఛన్ల కోసం వచ్చిన లబ్ధిదారులతో ఒకింత రద్దీగా ఉన్న సచివాలయం

కుప్పం: సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు ఈ నెలలో కూడా అగచాట్లు తప్పలేదు. గత ప్రభుత్వ పాలనలో ఇళ్ల వద్దకే వెళ్లి లబ్ధిదారులకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేసే విధానం ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ఈ పద్ధతికి కూటమి ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టి, సచివాలయం లేదా గ్రామంలో ఒక చోటుకు లబ్ధిదారులను ర్పించి పింఛన్లు ఇవ్వడం మొదలెట్టింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పింఛన్ల పంపిణీకి పూనుకుంది. పింఛనుదారులు సచివాలయం వద్దకు రావాలని ప్రచారం చేశారు. దీంతో ఉదయం 10 గంటలకే ఇబ్బందుల నడుమ లబ్ధిదారులకు తమకు అందుబాటులోని సచివాలయాలకు చేరుకున్నారు. అయితే సర్వర్ మొరాయించడంతో గంటల తరబడీ పడిగాపులు కాయాల్సి వచ్చింది. వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు పడిన ఇక్కట్లు చెప్పనలవికాదు. పట్టణంలోని సచివాలయం–2 వద్ద వృద్ధులు, వికలాంగులు పింఛన్ల కోసం పడిన అవస్థలు వర్ణనాతీతం. నడవలేని స్థితిలో ఉన్నా వృద్ధులు కష్టతరంగా నడచి వచ్చారు. రెండు గంటలు పాటు సచివాయం వద్ద నిరీక్షించి నీరసించిపోయారు. దీనికితోడు సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో పింఛన్లు పంపిణీ చేసే సిబ్బంది, లబ్ధిదారులు తీవ్ర అసహనానికి గురయ్యారు.

మొరాయించిన సర్వర్

పలమనేరు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీకి ఇబ్బందులు తప్పలేదు. పింఛను బట్వాడా సర్వర్ పనిచేయక రెండు గంటలపాటు సేవలు స్తంభించాయి. దీంతో సచివాలయ సిబ్బంది తామేమీ చేయలేమంటూ చేతులెత్తేశారు. దీంతో ఇబ్బందుల నడుమ ఎలాగో సచివాలయాలకు వచ్చిన పింఛనుదారులు తీవ్ర అసహనానికి గురయ్యారు. పడిగాపులు కాసి బేజారెత్తారు. ఎట్టకేలకు ఆపై సేవలు పునరుద్ధరించడంతో పింఛనుదారులు ఉపశమనం లభించింది. ×జగను ప్రభుత్వం ఉన్నంత కాలం ఇన్ని కష్టాలు లేవు నాయనా.. పొద్దున్నే ఇంటికాడికొచ్చి మరీ పింఛన్లు ఇచ్చేవాళ్లు..ఆరోజులే బాగుండాయ్..ఇప్పుడు ఆరోగ్యం బాగా లేకుండా సచిలవాలయానికో..వాళ్లు చెప్పిన చోటుకో అవస్థలు పడి తీసుకోవాల్సి వస్తాంది పింఛను* అని పలువురు వృద్ధులు నిట్టూరుస్తూ వెనుదిరిగారు. ఇంత చేసినా పలమనేరు మండలంలో జిల్లాలోనే ఆఖరు స్థానంలో నిలిచింది. ఇంకనూ 567మందికి పింఛను ఇవ్వాల్సి ఉంది.

బైరెడ్డిపల్లెలోనూ పడిగాపులే..!

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె మండలంలోనూ సర్వర్ మొరాయించడంతో పింఛనుదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. మరోవైపు పలువురు సచివాలయ ఉద్యోగులు బదిలీపై వెళ్లడంతో పింఛన్ల పంపిణీ కూడా ఆలస్యమైంది. ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు సర్వర్లు పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడినట్లు ఎంపీడీఓ రాజేంద్రబాలాజి చెప్పారు. ఎట్టకేలకు 86.72 శాతం పింఛన్లు పంపిణీ చేశామని, మిగిలిన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంపిణీ చేస్తామని తెలిపారు.

గంటల తరబడి పడిగాపులు

సదుం: మండలంలో పింఛన్ల పంపిణీకి ఉదయం సర్వర్ సమస్య తలెత్తింది. పలుచోట్ల సర్వర్ పని చేయకపోవడంతో పంపిణీకి సచివాలయ సిబ్బంది అవస్థలు పడ్డారు. వృద్ధులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. సాయంత్రం 5 గంటల వరకు మండలంలో సుమారు 94 శాతం పంపిణీ పూర్తి అయినట్లు అధికారులు చెప్పారు.

డిగ్రీ కళాశాలకు జిమ్ పరికరాలు



జిమ్ పరికరాలు అందజేస్తున్న బాలసుబ్రమణ్యం

పుంగనూరు: స్థానిక ఎన్ఎస్.పేటలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం శుక్రవారం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం రూ.50వేల విలువజేసే ట్రెడ్‌మిల్‌తోపాటు పుల్లప్స్ చేయడానికి జిమ్ పరికరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్‌కు విరాళంగా అందజేశారు. విద్యార్థులు ఫిట్‌నెస్ కోసం వీటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, అనిల్‌కుమార్, రామ్‌కుమార్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన సదస్సు నేడు

కల్లూరు(పులిచెర్ల): మామిడి, టమాట పంటల సాగుపై శనివారం ఉదయం 10 గంటలకు పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన శాఖాధికారిణి సంతోషి కుమారి తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూధన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు పాల్గొంటారని, మండలంలోని రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


చంద్రారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ భరత్

● పరామర్శ

రామకుప్పం: మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ శుక్రవారం ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే పార్టీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి అల్లుడు సోమశేఖర్‌రెడ్డి గతవారం హఠాన్మరణం పొందారు. దీంతో ఆయన కుటుంబాన్ని కూడా భరత్ పరామర్శించారు. అనంతరం మండలంలోని నేతలు, కార్యకర్తలను కలిశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లో ఎండగట్టేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, నేతలు చెంగారెడ్డి, సిద్ధప్ప, ఏజస్, యశ్వంత్ రెడ్డి, జమీను ప్రసాద్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న భరత్

● 'అమరజీవి'కి నివాళి

కుప్పం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎమ్మెల్సీ భరత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. శాంతిపురం మండలం మెరసనపల్లి సూర్యకుమారి, రామకుప్పం కో–కన్వీనర్ చంద్రారెడ్డి అల్లుడు సోమశేఖర్ రెడ్డి, కుప్పం రెండవ కౌన్సిలర్ మునిరాజ్ తండ్రి రాజప్ప మృతి చెందారు. వీరి కుటుంబాలను భరత్ పరామర్శించి ఓదార్చారు.

మృత్యువుతో పోరాడి ఓడిపోయింది

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి
- అత్తింటి వేధింపులే కారణమని మృతురాలి సెల్ఫీ విడుదల

కుప్పం రూరల్: గత నెల 23న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. చికిత్స పొందుతూ శుక్రవారం తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి ఆస్పత్రిలో కన్నుమూసింది. వివరాలు.. కుప్పం మండలం కూర్మానుపల్లెకు చెందిన ధనలక్ష్మి (22)కు పైమాసి గ్రామానికి చెందిన సంతోష్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లైనప్పటి నుంచి భర్త, అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తుండడంతో తట్టుకోలేక రెండు నెలల క్రితం పుట్టినింటికి చేరింది. అయినప్పటికీ వేధింపులు ఆగలేదు. దీంతో కుంగిపోయిన ధనలక్ష్మి గత నెల 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ కాదని వైద్యులు చెప్పడంతో అక్కడి నుంచి తిరుపతి స్విమ్స్‌లో చేర్పించారు. అక్కడ ఆమె ఆరోగ్యం విషమించడంతో తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం కన్నుమూసింది. మరణించే ముందు ధనలక్ష్మి తన మరణానికి కారణంగా భర్త సంతోష్, వారి కుటుంబ సభ్యులే అని సెల్ఫీ వీడియో విడుదల చేసింది. ప్రస్తుతం ఆ వీడియో సోషియల్ మీడియాలో వైరల్ అవుతోంది. మృతురాలికి ఆరు నెలల కుమార్తె ఉంది. ఆమె మరణంతో కూర్మానుపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు సంస్మరణ ర్యాలీ..!


క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చిత్తూరులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం నుంచి ఎస్పీ మణికంఠ చందోలు క్యాండిల్ ర్యాలీ ప్రారంభించారు. శాంతి భద్రతలను కాపాడుతూ విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసుల సేవలు మరువలేనివని ఎస్పీ అన్నారు. వారిని స్మరిస్తూ గత పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను సైతం భాగస్వామ్యం చేశామన్నారు. పోలీసు విధులకు ఎలాంటి కళంకం తీసుకురాకుండా సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన భాను ప్రకాష్

చౌడేపల్లె: మోటార్ సైకిళ్లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం చౌడేపల్లె– పుంగనూరు మార్గంలోని బిల్లేరు సమీపంలో చోటుచేసుకొంది. స్థానికుల కథనం ..పలమనేరు మండలం గుండ్లపల్లెకు చెందిన భానుప్రకాష్, సుజాత దంపతులు పుంగనూరు వైపు బైక్‌లో వెళ్తుండగా ఇదే మార్గంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈఘటనలో భానుప్రకాష్ తీవ్రంగా గాయపడ్డాడు. సుజాతకు కూడా గాయాలయ్యాయి. దారిన వెళ్లేవారు వీరిని గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది గణేష్, ఈశ్వరయ్య అక్కడికి చేరుకుని వారిని మదనపల్లెకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం భానుప్రకాష్ (30)ను వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన మోటార్ సైక్లిస్టు సంఘటన స్థలం నుంచి బైక్‌తో సహా ఉడాయించాడు.

భక్తిశ్రద్ధలతో దీపావళి

- పలు ఆలయాల్లో నోముల వ్రతాలు
- గౌరీదేవికి ప్రత్యేక అలంకరణలు



వీ.కోట: దుర్గామాత ఆలయ పూజల్లో జెడ్పీ చైర్మన్, తోటకనుమలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే


వీ.కోట: భక్తులతో కిటకిటలాడుతున్న శివాలయం

పలమనేరు: పలమనేరు పరిధిలోని ప్రజలు గురు, శుక్రవారాల్లో దీపావళి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పండుగ సందడి పెద్దగా కనిపించలేదు. ఈ పర్యాయం వేరుశనగ పంట దెబ్బతినడంతో రైతులు ఇబ్బందులు పడడం పండుగపై ప్రభావాన్ని చూపింది. ఇక గ్రామాల్లోని ఆలయాల్లో గౌరీదేవిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వహించారు. గౌరీనోముల వ్రత మహత్యాన్ని పురోహితులు వివరించారు. పట్టణంలోని శివాలయంలో పెద్ద సంఖ్యలో మహిళలు నోముల వ్రతమాచరించారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ దంపతులు తమ స్వగ్రామంలో ఘనంగా పండుగను జరుపుకున్నారు.

గంగవరంలో..

గంగవరం: మండల వ్యాప్తంగా ప్రజలు దీపావళి పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల వద్ద పసుపు, కుంకుమ, కలశాలతో గౌరీ అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చారు. మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయాల వద్ద గౌరీ అమ్మవారి వ్రతమాతరించారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండల వ్యాప్తంగా శుక్రవారం పలు ఆలయాల్లో కేదార నోములు భక్తిశ్రద్ధలతో నోచుకున్నారు. చెన్నారెడ్డిపల్లె చెరువు కట్టపై ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, రాయలపేటలోని బసవేశ్వరస్వామి ఆలయంలో మహిళలు సామూహిక వ్రత పూజలు నిర్వహించారు. అర్చకులు హరీష్ కేదార గౌరి ప్రాశస్త్యం, వ్రత సంకల్పం గురించి వివరించారు. నోము దారాలు ధరించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు వేసి దీపాలు వెలిగించడంతో కొత్త శోభ సంతరించుకుంది.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలో గురు, శుక్ర వారాల్లో దీపావళి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వాహనాలను శుభ్రం చేసి పుష్పాలు, అరటి పిలకలు, చెరకు ఆకులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు, యువతీయువకులు బాణసంచా పేలుస్తూ సందడి చేశారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ నిర్వహించిన ఆయుధ పూజలో మాజీ ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ పాల్గొని పార్టీ శ్రేణులతో కొంత సేపు ముచ్చటించారు.

వీ.కోటలో..

వి.కోట: దీపావళి పండుగ, గౌరీ వ్రతం పురస్కరించుకుని మండల వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పట్టణంలోని దుర్గామాత, దాసార్లపల్లెలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరీ వ్రతమాచరించారు. తొలుత పసుపుతో గౌరీ దేవి ప్రతిమను కొలువుదీర్చి, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. నోములు నోచడానికి చుట్టు పక్కల గ్రామాలీ నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు.

కేదారేశ్వర వ్రతంలో జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే

కేదారేశ్వరుని అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నామని పట్టణంలోని దుర్గామాత పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ తెలిపారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ సొంత గ్రామమైన తోటకనుమ ఆలయంలో తన సతీమణితో కలసి పూజల్లో పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం మహిళలు నోములు నోచారు. ఆలయం భక్తులతో కిక్కిరిసింది.

భక్తిప్రపత్తులతో కేదారేశ్వరిదేవి నోములు

పుంగనూరు: దీపావళి పండుగ పురస్కరించుకుని శుక్రవారం కేదారేశ్వరిదేవి నోములను శుక్రవారం భక్తిప్రపత్తులతో ఆచరించారు. పట్టణంలోని శ్రీభోగనంజుండేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే కోనేటి వద్ద ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి నోములునోచారు. అక్కడే నాగదేవతలకు పూజలు చేశారు. మహిళలు, పురుషులు, వారి కుటుంబ సభ్యులతో కలసి ఈ నోముల్లో వ్రతకల్పం నిర్వహించారు. అమ్మవారికి మడితో అత్తిరసాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. కుటుంబ సభ్యులందరూ కలసి బంగారు, వెండితో చేసిన నోము ముడులను కట్టుకున్నారు. నోముల పండుగ సందర్భంగా పట్టణంలోని ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో కేదారేశ్వరీ స్వామి వ్రతమాచరించారు. శుక్రవారం స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, కరణంవారిపల్లె అభయాంజనేయస్వామి ఆలయాల్లో మహిళలు వేదపండితులు రాజశేఖర దీక్షితులు, ఆనందాచార్యుల ఆధ్వర్యంలో తొలుత పూజలు చేశారు. వేదపండితులు వ్రత మహత్యాన్ని వివరించారు. అలాగే శివాలయంలో ప్రత్యేక అర్చనలు,అభిషేక పూజలు చేశారు.

సదుంలో..

సదుం: దీపావళి పర్వదినాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరభద్రస్వామి, మత్తుకువారిపల్లె సమీపంలోని మల్లీశ్వరస్వామి ఆలయాలలో పూజలు చేశారు. శుక్రవారం సామూహిక కేదారేశ్వరస్వామి వ్రతం నిర్వహించారు.






పలమనేరు మండలంలోని పలు ఆలయాల్లో గౌరీ పూజలు, పెద్దపంజాణి: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..., వీ.కోట: నోములు నోచుకుంటున్న మహిళలు, పుంగనూరు: భోగనంజుండేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు





రామకుప్పం: శివాలయంలో నోములు నోస్తున్న మహిళలు, చౌడేపల్లె: కరణంవారిపల్లెలో..., పుంగనూరు: కేదారేశ్వరిదేవి నోములకు హాజరైన ప్రజలు, బైరెడ్డిపల్లె: ఆయుధపూజలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ